# భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

**రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు**

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 19 : సమక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని రామంగుండం సీపీ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించే సమక్క-సారలమ్మ జాతర స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, దొంగతనాలు జరగకుండా స్పెషల్ టీంలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భూకబ్జాలు చేసినా.. రేషన్ బియ్యం దందా, గుడుంబా, గంజాయి రవాణావంటివి చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



సమక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు



# మైసమ్మ జాతర పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేసున్న నాయక్‌పోడు సంఘం నాయకులు

జన్నారం, ఫిబ్రవరి 19 : మందమర్రి మండలం బొక్కలగుట్ట వద్ద ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే మైసమ్మ జాతర పోస్టర్లను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివాసీ నాయక్‌పోడు సేవాసంఘం ఆధ్వర్యంలో ఎస్ఐ సతీశ్, హెడ్‌కానిస్టేబుల్ తుకారం, జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్, యూత్ అధ్యక్షుడు ప్రభాకర్, వెంగయ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, రాజన్న, రమేశ్, భూమేశ్ పాల్గొన్నారు.

## వైద్యం వికటించి బాలింత మృతి

# ‘శ్రీ కిరణ్ మల్టీ స్పెషాలిటీ’కి అండగా ఖాకీలు

## చెన్నూర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌ను కాపాడేందుకు సహకారం

- జైపూర్ వద్ద మృతదేహాన్ని అడ్డుకొని తిరిగి మంచిర్యాల మార్చురీకి తరలింపు
- పరిధిదాటి అత్యుత్సాహం
- బంధువులు, నాయకుల ఆందోళనను అడ్డుకునే యత్నం
- చెన్నూర్‌లో ప్రధాన రహదారిపై కొనసాగుతున్న రాస్తారోకో..

మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : వైద్యం వికటించి బాలింత మృతి చెందిందంటూ ఆమె బంధువులు ఆందోళనకు దిగగా, ఆ ఆసుపత్రిని కాపాడేందుకు పోలీసు యంత్రాంగం మొత్తం కదిలిరావడం విమర్శలకు తావిస్తున్నది. ఈ ఘటన సోమవారం చెన్నూర్ పట్టణంలోని శ్రీ కిరణ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జరగడం కలకలం రేపింది. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని సిరోంచ తాలూక కారస్‌పల్లి గ్రామానికి చెందిన గర్భిణి రాపల్లి మంగ (28) ప్రసవం కోసం ఆదివారం సాయంత్రం 5 గంటలకు చెన్నూర్ పట్టణంలోని శ్రీ కిరణ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు వచ్చింది. డాక్టర్ సోమవారం ఉదయం మంగకు ఆపరేషన్ చేయగా, పాప పుట్టింది. అనంతరం బాలింత పరిస్థితి విషమంగా మారడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా డాక్టర్ సూచించారు. అంతేగాకుండా వారే స్వయంగా ప్రైవేట్ అంబులెన్స్‌ను పిలిపించి.. వెంటిలేటర్ ఏర్పాటు చేసి మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి అప్పటికే ఆమె చనిపోయిందని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు మంగ మృతదేహంతో చెన్నూర్‌కు వస్తుండగా జైపూర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. మంగ మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని తిరిగి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. మంగకు ఇది రెండో కాన్పు. వైద్యం వికటించడంతోనే మంగ మృతి చెందిందని బంధువులు, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి బీ గోపినాథ్, చెన్నూర్ డివిజన్ అధ్యక్షుడు మసాని రమేశ్, నాయకులు తగరం వెంకటేశ్, రవి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. బాలింత మృతికి కారణమైన డాక్టర్‌పై తగిన చర్యలు తీసుకొని, మృతురాలి కుంటుంబానికి తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళన జరుగకుండా పోలీసు యంత్రాంగం మొత్తం కిరణ్ ఆసుపత్రికి సహకరించిందని పలువురు ఆరోపించారు. ఇక్కడ చికిత్స వికటించడం, బంధువులు ఆందోళన చేయడం సాధారణ విషయం. ఈ ఆసుపత్రిలో ఇప్పటికే ఇలాంటి రెండు.. మూడు ఘటనలు చోటు చేసుకున్నాయి. కానీ.. ఈ కేసు విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం పలు అనుమానాలకు తావిచ్చినట్లైంది. ఏదైన లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన సమస్య వస్తేనే వారి పరిధిని దాటివెళ్తారు. కానీ.. చెన్నూర్ సీఐ మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ ముందు కాపలా కాయడం వెనుక ఆంతర్యమేమిటోనని పలువురు మాట్లాడుకోవడం గమనార్హం. ఇదే సమయంలో కోటపల్లి సీఐ చెన్నూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చి డాక్టర్లతో మాట్లాడారు. మరోవైపు ఇందారం, శ్రీరాంపూర్ ఏరియాల్లో డెడ్ బాడీ చెన్నూర్‌కు రాకుండా మోహరించినట్లు కూడా తెలిసింది. ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం ఓ పోలీసు ఉన్నతాధికారికి రూ. లక్షలు ముట్టజెప్పి, విషయం బయటకు రాకుండా చూడాలని కోరినట్లు తెలిసింది. దీంతో సదరు అధికారి తన పరిధిలోని సీఐ, ఎస్సైలను ఈ పనికి పురమాయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆసుపత్రిని కాపాడేందుకు పోలీసు యంత్రాంగం మొత్తం ఎందుకు కదిలింది అనేది ప్రశ్నార్థకంగా మారింది. బాధితుల పక్షాన ఉండాల్సిన అధికారులే.. ఇలా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వివరణ కోరగా.. చెన్నూర్‌లో ధర్నా, ఆందోళన జరుగకుండా ఉండాలనే ఉద్దేశంతో తమ చెన్నూర్ సీఐ మంచిర్యాల వరకు వెళ్లారని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, కిరణ్ హాస్పిటల్ ముందున్న ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి 9.30 గంటల దాకా బంధువులు, నాయకులు ఆధ్వర్యంలో రాస్తారోకో కొనసాగుతున్నది.



చెన్నూర్ దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు, ఐఎఫ్‌టీయూ నాయకులు



మంచిర్యాల మార్చురీ వద్ద కాపల కాస్తూ మీడియాను చూసి దూరంగా వెళ్లిపోతున్న చెన్నూర్ సీఐ

# చిన్న సైజు.. పెద్ద మోసం..

- అంగన్‌వాడీ సెంటర్లకు అతిచిన్న కోడిగుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు
- దాల్ పంపిణీలోనూ అదే తీరు
- ‘మామూలు’గా తీసుకుంటున్న ఐసీడీఎస్ అధికారులు



30 గ్రాములే ఉన్న అంగన్ వాడీ కోడిగుడ్లు



ట్రేలో తక్కువ బరువున్న కోడిగుడ్లు

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/ మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 19 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ చేయాల్సిన కాంట్రాక్టర్లు కాసుల కోసం కక్కుర్తిపడి అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సర్కారు లక్ష్యానికి గండికొడుతున్నారు.

### చిన్న సైజు కోడిగుడ్లు సరఫరా..

అగ్‌మార్క్ నిబంధనల మేరకు గుడ్డు బరువు 45 నుంచి 52 గ్రాములుండాలి. 10 గుడ్లను ఒక యూనిట్‌గా పరిగణిస్తే.. వాటి బరువు 450 నుంచి 525 గ్రాములుండాలి. ఒక ట్రేలో 30 గుడ్లు ఉంటాయి కాబట్టి.. ట్రే బరువును తీసివేసి 1350 గ్రాముల నుంచి 1560 గ్రాములు ఉండాలి. కానీ కాంట్రాక్టర్లు చాలా వరకు నాసిరకం.. బరువు.. పరిమాణం తక్కువ ఉన్న గుడ్లను సరఫరా చేస్తున్నారు. కేవలం 30 నుంచి 35 గ్రాముల బరువు గల గుడ్లను పంపిణీ చేస్తున్నారు. దీనిని ప్రాజెక్టు పరిధిలో సీడీపీవోలు గమనించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి. కానీ అలా జరగడం లేదు. నాణ్యత పర్యవేక్షించాల్సిన సిబ్బంది ఎలాంటి ఫిర్యాదులు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు మూడు చిన్న గుడ్లు.. ఒక పెద్ద గుడ్డు మాదిరిలా.. కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు.

### చిన్న సైజులో పెద్ద మోసం..

జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, గర్భిణులు 4181, బాలింతలు 4835, 1-3 ఏళ్ల పిల్లలు 19,510 మంది, 3 - 6 సంవత్సరాల పిల్లలు 19,435 మంది ఉన్నారు. ఇందులో గర్భవతులు, బాలింతలు, 3 - 6 సంవత్సరాలున్న 28,451 మందికి ఒక్కొక్కరికీ ప్రతి నెలా 30 చొప్పున 8,53,530 కోడి గుడ్లు ఇవ్వాలి. అలాగే ఏడు నెలల నుంచి 3 సంవత్సరాల వరకు ఉన్న 24,011 మంది చిన్నారులకు నెలకు 16 చొప్పున 3,84,176 కోడిగుడ్లు అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టరు మాత్రం అధిక సంఖ్యలో చిన్న (30 గ్రాముల) సైజున్న గుడ్లు సరఫరా చేస్తున్నాడు.

### నాణ్యత లేని పప్పు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లతో పాటు పప్పు, నూనె, బాలామృతం, పాల ప్యాకెట్లు, మురుకులు, బియ్యం సరఫరా అవుతుంటాయి. పప్పు వేసే కాంట్రాక్టర్ పురుగులు పడ్డ, ఉండలు కట్టిన, చెడిపోయిన పప్పును సరఫరా చేస్తున్నాడు. దానిని ఆయాలు వండాలంటే చెరిగితే సగానికి సగం వేస్టేజీ పోతుందని, నల్ల పురుగులైతే పప్పు గింజలకంటే ఎక్కువ ఉంటున్నాయని చెబుతున్నారు.

### పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్లకు వరం..

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లపై, పప్పులపై పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లకు వరంగా మారింది. ప్రాజెక్టు పరిధిలో సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు కేంద్రాలకు వచ్చిన సరుకులను పరిశీలించకపోవడం, ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఒత్తిడి తేవడం లాంటివి చేస్తున్నారే తప్ప.. కాంట్రాక్టర్ తప్పును చూపించడం లేదు.

### కాంట్రాక్టర్ల కొమ్ము కాస్తున్న అధికారులు..

అంగన్‌వాడీ సెంటర్లకు కోడిగుడ్లు, పప్పు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు సీడీపీవోలు కొమ్ము కాస్తున్నట్లు సమాచారం. ఇటీవల ‘నమస్తే తెలంగాణ’లో ‘గుడ్లు గుటుక్కయస్వాహా’ పేరిట కథనం ప్రచురితం కాగా, సదరు కాంట్రాక్టర్‌ను కాపాడేందుకు ఒక సీడీపీవో రంగంలోకి దిగి.. పేపర్లో ప్రచురితం చేసింది తప్పు అని.. సంబంధిత సెంటర్ నుంచి బలవంతంగా రాయించుకున్నట్లు తెలిసింది. లబ్ధిదారుల నుంచి సైతం గుడ్ల సరఫరా సక్రమంగా జరుగుతుందని రాయించుకొని అధికారులకు సమర్పించినట్లు సమాచారం. రిజిస్టర్‌లో వచ్చిన గ్యాప్‌లను పరిశీలించి.. గుడ్ల సరఫరా సక్రమంగా జరుగడంలేదని సదరు కాంట్రాక్టర్‌పై రిపోర్టు చేయాల్సిన సీడీపీవో ఆయనకు సపోర్టుగా వివరణలు తీసుకోవడం వెనుక అంతర్యమేమిటో అంతుచిక్కడం లేదు. మరోవైపు కలెక్టర్ సైతం చిన్న సైజులో వస్తున్న కోడిగుడ్లను తెప్పించుకొని పరిశీలించినట్లు సమాచారం.



చెరిగినా ఇంకా పోని నల్ల పురుగులు

### బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

నాణ్యమైన సరుకులు సరఫరా చేయని కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని అన్ని సెక్టార్‌ల సీడీపీవోలు, ప్రాజెక్టులోని సూపర్‌వైజర్లు ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పర్యవేక్షించాలి. నాణ్యమైన సరుకులు సరఫరా అవుతున్నాయా.. లేదా.. పరిశీలించాలి. రెండో రిజిస్టర్‌లో ఏయే నెలల్లో ఎన్ని గ్యాప్‌లు ఉన్నాయో గమనించాలి. అవకవతకలకు పాల్పడితే చర్యలు తప్పవు.

- కొట్టె చిన్నయ్య, జిల్లా సంక్షేమ అధికారి, మంచిర్యాల

# జోరుగా మట్టి మాఫియా

వేమనపల్లి, ఫిబ్రవరి 19 : వేమనపల్లి మండలంలో మట్టి మాఫియా జోరుగా సాగుతోంది. మట్టిగుట్టలపై కన్నేసిన కొందరు అక్రమార్కులు వ్యాపారంగా మలుచుకున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆక్రమణదారులు పెట్రేగిపోతున్నారు. జిల్లాడ గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. రోడ్ల నిర్మాణాలకు కాంట్రాక్టర్‌తో చేతుల కలిపి జేసీబీలతో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లెడ, కన్నెపల్లి మండలాల సరిహద్దు సర్వే నంబర్ 102 ప్రాణహిత-చేవెళ్ల కాలువ ఒడ్డున మట్టి కుప్పలకు అనుమతులు లేకుండా, నిబంధనలు అతిక్రమించి మట్టిని తరలిస్తున్నారు. జిల్లెడ గ్రామం నుంచి జక్కపల్లి కిలో మీటర్ వరకు ఐటీడీఏలో రూ.కోటి నిధులతో చేపడుతున్న బీటు రోడ్డుకు జిల్లెడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జక్కపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ సదరు కాంట్రాక్టర్‌తో చేతులు కలిసి తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ రమేశ్ మట్టి మాఫియాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు ఆర్ఐకు ఆదేశాలు జారీ చేయడంతో జిల్లెడ గ్రామానికి చేరుకున్న ఆర్ఐ జేసీబీతోపాటు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. జరిమానా విధించి కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఇదిలాఉండగా జిల్లెడ గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ చేస్తున్న మట్టి అక్రమ రవాణాపై సంఘటన స్థలానికి వెళ్లిన పాత్రికేయుడిపై అసభ్య పదజాలంతో ‘నీ అంతు చూస్తా’ అని రెవెన్యూ అధికారి ముందు మాట్లాడడం ఆశ్చర్యానికి గురి చేసింది. మట్టి అక్రమ రవాణా ఫొటోలు తీసినందుకు వెళ్లిన పాత్రికేయుడిపై ‘నిన్ను హత మారుస్తాం’ అని బెదిరించిన తీరు అధికారుల్లో భయం పుట్టించింది. పాత్రికేయుడు నీల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# స్వీట్ షాపు యజమానికి రూ.10 వేల జరిమానా



జరిమానా వసూలు చేస్తున్న మున్సిపాలిటీ అధికారులు

చెన్నూర్, ఫిబ్రవరి 19 : పట్టణంలోని మహదేవ్ స్వీట్ షాపు యజమానికి మున్సిపాలిటీ అధికారులు సోమవారం జరిమానా విధించారు. ఆదివారం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కేక్ కొనుగోలు చేయగా, అది బూజు పట్టి కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ అధికారులు స్వీట్ షాపులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాడైపోయిన తినుబండారాలు అమ్ముతున్నారనే విషయం బహిర్గతం కావడంతో షాపు యజమానికి మున్సిపాలిటీ అధికారులు రూ. 10 వేల జరిమానా విధించి వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఆర్ఐ నవీన్, వార్డు ఆఫీసర్ సదానందం పాల్గొన్నారు.

# 108లో అత్యాధునిక సేవలు

**రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిశోర్**



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కోటపల్లి, ఫిబ్రవరి 19 : 108లో అత్యాధునిక సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిశోర్ అన్నారు. కోటపల్లి మండల కేంద్రంలోని 108 వాహనాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 108 అంబులెన్స్ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వద్దని సూచించారు. రికార్డులు, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. స్థానికులను అంబులెన్స్ సేవల గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంబులెన్స్ వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ఉన్నారు.



మేడారం జాతర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్



మందమర్రిలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

# మేడారం జాతరకు బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యేలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 : బెల్లంపల్లి నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు సోమవారం ప్రత్యేక ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. స్థానిక కొత్తబస్టాండ్ వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మేడారం జాతరకు వెళ్లే మహిళా భక్తులకు ఉచిత బస్ సౌకర్యం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ రడగంబాల బస్తీలోని ఆయన నివాసంలో గాంధారీ మైసమ్మ జాతర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతరను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ఏఎంసీ ఏరియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. క్యాంపు కార్యాలయంలో వసతులు, గదుల సౌకర్యాలను పరిశీలించారు.

### మందమర్రిలో వివేక్..

మందమర్రి, ఫిబ్రవరి 19 : మందమర్రి మార్కెట్‌లోని బస్‌స్టేషన్ నుంచి మేడారం జాతరకు వెళ్లే బస్సులను సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జెండా ఊపి ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది నిర్మల్ డిపోనకు చెందిన 65 బస్సులను మందమర్రికి కేటాయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం సోలేమాన్, మంచిర్యాల డిపోమేనేజర్ రవీందర్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్, నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేశ్, సొతుకు సుదర్శన్, దుర్గం నరేశ్, కాడారి జీవన్, నోముల ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు.



సంతోష్‌కుమార్



కిశోర్‌చంద్రరెడ్డి



రంజిత్



షేక్ ఖాసీంసాహెబ్

# బాధ్యతలు స్వీకరించిన ఎంవీఐలు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 19 : మంచిర్యాల జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నూతనంగా నియామకమైన ముగ్గురు ఎంవీఐలు, ఏఎంవీఐ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆసిపాబాద్ జిల్లా నుంచి వచ్చిన సంతోష్‌కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వచ్చిన కిశోర్‌చంద్రారెడ్డి, కోరుట్ల నుంచి వచ్చిన రంజిత్ ఎంవీఐలుగా బాధ్యతలు చేపట్టారు. అలాగే ముగ్గురు ఏఎంవీఐలకుగాను షేక్ ఖాసీంసాహెబ్ ఒక్కరే బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది వీరికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, జూనియర్ అసిస్టెంట్‌లు వనిత,లింగయ్య,మహేశ్, సబార్డినేటర్ జయమ్మ పాల్గొన్నారు.

# సమన్వయంతో సమస్యల పరిష్కారం

**మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**

నస్పూర్, ఫిబ్రవరి 19 : అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సభావత్ మోతీలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 57 దరఖాస్తులు అందాయని, అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

# ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- సింగరేణి సీఎండీ బలరాం నాయక్
- మందమర్రి కేకే ఓసీ ప్రాజెక్టు సందర్శన

మందమర్రి, ఫిబ్రవరి 19 : ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్ అన్నారు. సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఓసీ ప్రాజెక్టును సోమవారం ఏరియా అధికారులతో కలసి సందర్శించారు. గని వ్యూపాయింట్ నుంచి పనులను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని, అన్ని విభాగాల ఉద్యోగులు సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. ఏరియా అధికారులు రక్షణపై ప్రధాన దృష్టి పెట్టాలని, ఉద్యోగులు, కార్మికుల రక్షణకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కేకే ఓసీ అధికారులు సీఅండ్ఎండీని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) శ్రీనివాస్, ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్, కేకేఓసీ ప్రాజెక్టు అధికారి రమేశ్, సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్, మేనేజర్ వీరయ్య పాల్గొన్నారు.

### నిరుద్యోగుల కోసమే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

సింగరేణి కార్మిక కుటుంబాల పిల్లలతో పాటు పరిసర గ్రామాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం మందమర్రి పట్టణంలోని సిమ్టార్స్‌లో సింగరేణి యాజమాన్యం, సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని సీఅండ్ఎండీ బలరాం నాయక్‌తో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వరల్డ్ క్లాస్‌ను తలపిస్తుందన్నారు. పబ్లిక్ సెక్టార్‌లో ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే చాలా సమయం పడుతుందని, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ కృషి ఫలితంగా అనతి కాలంలోనే స్కిల్ డెవలప్‌సెంటర్ రూపు దిద్దుకుందన్నారు. సింగరేణి సీఎండీ బలరాం నాయక్ మాట్లాడుతూ మొట్టమొదటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇక్కడ ప్రారంభించినందుకు సంతోషంగా ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్ అండ్ పా) ఎన్‌వీకే శ్రీనివాస్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ. జనక్‌ప్రసాద్, ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్, సీఎంవోఏఐ ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, జాయింట్ డైరెక్టర్ విద్యానంద్ పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్, సీఎండీ బలరాం

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు

# సీవోఈ విద్యార్థి ఎంపిక

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 19 : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జూనియర్ మీట్‌కు బెల్లంపల్లి సీవోఈ విద్యార్థి జంగంపల్లి ప్రణయ్‌చరణ్ (పదో తరగతి) ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. పాట్నా(బిహార్) లో ఈ నెల 21 నుంచి 23వ తదీ వరకు జరుగనున్న జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున ప్రణయ్ ఆడనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో తల్లిదండ్రులు వెంకటమ్మ,రాజేందర్‌ల సమక్షంలో ప్రణయ్‌ని అభినందించారు. సంక్షేమ గురుకులాల స్పోర్ట్స్ ఆఫీసర్ రాంలక్ష్మణ్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వామన్, రాకేశ్‌కుమార్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట పోచన్న, కిరణ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.



విద్యార్థి ప్రణయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు, ఉపాధ్యాయులు